

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ : ఎంఎల్ఎ వాసు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రస్తుత సమాజంలో మహిళల ఆత్మ రక్షణకు మార్షల్ ఆర్ట్స్ నేర్చు కోవడం చాలా అవసరమని రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఫారెస్ట్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ హాల్లో రెండు రోజుల పాటు జరిగే 9వ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఉషు సీనియర్ అండ్ సబ్ జూనియర్ ఛాంపియన్‌షిప్ పోటీలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసం చేకూరుతుందని, దేహదారుఢ్యం సొంతమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఆదిశేషు, కార్యనిర్వాహకులు బి.నరసింహరావు, టిడిపి నాయకులు అజ్జరపు రమేష్, మరుకుర్తి రవియాదవ్, హరి బెనర్జీ, జిల్లా ఉషు అసోసియేషన్ అధ్యక్షుడు అజ్జరపు వాసు, కార్యదర్శి ఆర్.సుందరం, పొన్నాడ బాబి, వివిధ జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు.

రోగుల జేబులకు చిల్లు

- ప్రయివేటు ల్యాబ్‌ల అడ్డగోలు వసూళ్లు
- ప్రజల భయాన్ని సొమ్ము చేసుకుంటున్న వైనం
- ఆందోళనలో రోగులు, కుటుంబీకులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్రయివేటు ల్యాబ్ సెంటర్ల నిర్వాహకులు రోగుల జేబులకు చిల్లు పెడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా నెల రోజులుగా విజృంభిస్తున్న విషజ్వరాలు వారికి వరంగా మారాయి. ఒకప్పుడు వైద్యులు రోగి నాడి పట్టి కారణమేంటో తెలుసుకునేవారు. రోగి చెప్పిన లక్షణాలను బట్టి మందులిచ్చేవారు. అవి వాడినా ఫలితం కనిపించకపోతే వైద్య పరీక్షలకు పంపేవారు. కానీ నేడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఆర్ఎంపి వైద్యులు సైతం ముందుగా వైద్య పరీక్షనే ప్రిఫర్ చేస్తున్నారు. ఫలితాలు వెలువడిన అనంతరమే మందులు రాస్తున్నారు. దీన్నే అవకాశంగా మార్చుకుని కొన్ని ల్యాబ్‌ల నిర్వాహకులు అర్హతలేని టెక్నీషియన్లతో పరీక్షలు చేయిస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. వైద్యులతో ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం 20 నుంచి 30 శాతం కమీషన్లు ఇస్తూ అడ్డగోలు ఫీజులు గుంజుతున్నారు. మరి కొంతమంది పరీక్షల అనంతరం రిపోర్టులు ఇవ్వకుండానే సెల్‌ఫోన్లకు టెక్స్ట్ మెసేజ్‌ని పంపించి, అవే రిపోర్టులు అంటూ బిల్లులు వసూలు చేస్తున్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారుల హెచ్చరికలను సైతం పట్టించు కోవడం లేదు.

అడ్డగోలుగా ఫీజులు

జిల్లాలో అధికారుల అనుమతులతో కేవలం సుమారు 266 సెంటర్లు మాత్రమే ఉన్నట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఈ సంఖ్య ఐదు రెట్లు ఉంటాయి. ఒక్కొక్క ల్యాబ్‌లో ఒక విధంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. రక్తంలో కొవ్వు నిల్వల కోసం చేయించే లిపిడ్ ప్రొఫైల్ టెస్ట్‌ల విషయంలో ఇష్టం వచ్చిన రీతిలో ఫీజులు వసూలు చేస్తున్నట్లు రోగులు చెబుతున్నారు. లిపిడ్ ప్రొఫైల్ టెస్టుకు రూ.500, లివర్ ప్రొఫైల్ పరీక్షకు రూ.500, థైరాయిడ్ ప్రొఫైల్‌కు రూ.600, కిడ్నీ ప్రొఫైల్ రూ.650, బ్లడ్ యూరియా రూ.150, యూరిక్ యాసిడ్ రూ.200, ఎలక్ట్రోలైట్స్ టెస్టుకు రూ.500, టైఫాయిడ్, మలేరియా నిర్ధారణకు రూ.250, షుగర్ టెస్టు రూ.200, డెంగ్యూ నిర్ధారణకు రూ. 800 నుంచి 1200, బ్లడ్ గ్రూప్ తెలుసుకొనేందుకు రూ.200, క్యాల్షియం పరీక్షకు రూ.250, కామెర్ల పరీక్షకు రూ.300, హెచ్ఐవి పరీక్షకు రూ.350, హెచ్‌బి పరీక్ష రూ.100 వరకు వసూలు చేస్తున్నారు. ఒకే డయాగ్నస్టిక్ సెంటర్‌లో వైద్యులకు ఇచ్చే కమీషన్‌ను బట్టి వివిధ రకాల ఫీజులు వసూలు చేస్తున్నారు.



నగరంలో ఓ ప్రయివేటు ల్యాబ్

ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతులు ఉన్న ల్యాబ్ సెంటర్లు, ఆసుపత్రులు మాత్రమే ల్యాబ్ సెంటర్లు ఏర్పాటు చేసి పరీక్షలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. ఈ ఆదేశాల పూర్తిగా బేఖాతరు చేస్తూఅర్హతలేని వారితో పరీక్షలు చేయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లోని డయాగ్నస్టిక్ సెంటర్లలో మౌలిక వసతులు లేకపోవడం వీరికి కలిసి వస్తోంది. ప్రైవేటు సెంటర్లలో కొద్దిగా అనుభవం ఉన్న టెక్నీషియన్లతోనే నిర్వాహకులు పరీక్షలు చేయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అర్హతలేని టెక్నీషియన్లతో పరీక్షలు చేయిస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నా, సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక డయాగ్నస్టిక్ సెంటర్ ఇచ్చిన రిపోర్టుకు, మరో సెంటర్ ఇచ్చే రిపోర్టుకు తేడా ఉంటోంది. రాజమహేంద్రవరంలో ఇలాంటి సంఘటనలు అనేకం బయటపడ్డా పట్టించుకునేవారు కరువయ్యారు.దీనిపై ఇప్పటికైనా అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.



ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఒపిఎస్ కోసం యుటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యునిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యుపిఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యుటిఎఫ్ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి మాట్లాడారు. 2004 జనవరి నుంచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సిపిఎస్‌ను అమలు చేస్తున్నాయన్నారు. పోరాటాల ద్వారా సాధించుకున్న పాతపెన్షన్ స్కీమ్ ఉద్యోగుల హక్కు అని భిక్ష కాదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సైతం బేఖాతరు చేస్తూ సిపిఎస్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అమలు చేస్తున్నాయన్నారు. ఒపిఎస్ కోసం 20 ఏళ్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయులు చేసిన పోరాటం ఫలితంగా కొన్ని రాష్ట్రాల్లో పాత పెన్షన్ పునరుద్ధరణ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చాంని తెలియజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్ స్థానంలో గ్యారెంటీడ్ పెన్షన్ స్కీం (జిపిఎస్)ను తెచ్చి సిపిఎస్ కంటే మెరుగైనదని నమ్మ బలికిందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు దీన్ని తిరస్కరించారన్నారు. ఈ జిపిఎస్‌కు మరో రూపంగా ఉన్న యుపిఎస్‌ను కేంద్ర కేబినెట్ ఆగస్టు 22న ఆమోదించిందన్నారు. దీనికి ఒపిఎస్‌కు ఎక్కడా పోలిక లేదన్నారు. ఇది కార్పొరేట్ల షేర్ మార్కెట్‌కు మాత్రమే లాభం చేకూర్చేలా ఉందన్నారు. వెంటనే దీన్ని రద్దు చేయాలన్నారు. జిల్లా కార్యదర్శి ఎన్. రవిబాబు మాట్లాడుతూ యుపిఎస్ లాంటి అంకెలు గారడీ చేసే పెన్షన్ స్కీం వద్దని పాత పెన్షన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యదర్శి కే.రమేష్‌బాబు మాట్లాడుతూ ఒపిఎస్ కోసం చేసే పోరాటానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు సంఘీభావం ప్రకటించాలని కోరారు. అనంతరం ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్, ఆర్‌డిఒ కె.లక్ష్మీశివజ్యోతికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు ఎన్.రవిబాబు, కె.రమేష్‌బాబు, సిహెచ్.దయానిధి, కెవిఎస్.ప్రకాష్‌రావు, సిహెచ్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

గోకవరం : కోరుకొండ యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం యుపిఎస్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. కోరుకొండ బస్ కాంప్లెక్స్ నుంచి తహాశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహాశీల్దార్ సుస్వాగతంకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిటర్ కమిటీ కన్వీనర్ ఎం.శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి కె.నాగభూషణం, కోరుకొండ మండల యుటిఎఫ్ అధ్యక్షులు జివి.శివబాబు, ఉపాధ్యక్షులు డిఎల్.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పి.లోవరాజేష్, గోకవరం, కోరుకొండ, సీతానగరం మండలాల యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కోరుకొండలో వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి - గోపాలపురం

రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభివృద్ధికి సంక్షేమానికి కృషి చేస్తుందని సాగునీటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామని ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు అన్నారు. శుక్రవారం గోపాలపురం శివారు తాడిపూడి సబ్ లిఫ్ట్-2 నుంచి సాగునీటని ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్ట ప్రాంతాల్లో రైతులు వేలాది ఎకరాలు పంటలు సాగు చేసేందుకు తాడిపూడి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ పంప్ హౌస్ ద్వారా నీటిని తోడి గోపాలపురం, దేవరపల్లి, కొయ్యలగూడెం, నల్లజర్ల నాలుగు మండలాలకు సుమారు 27,800 ఎకరాలకు నీరు అందించాల్సి ఉందన్నారు. అసంపూర్తిగా పనులు చేయడంతో ప్రస్తుతం 12వేల ఎకరాలకు నీరు అందిస్తామన్నారు. నవంబరు చివరి వరకు సాగు నీరు అందిస్తామని తెలిపారు. ఇరిగేషన్ ఇఇ టి.శ్రీనివాస్, ఎఇ చంద్రశేఖర్, గుత్తేదారుడు పి.చంద్రశేఖర్ పలు సమస్యలను ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లారు. నాలుగేళ్ల నుంచి పంపు హౌస్ మెయింటినెన్స్, వాటర్ రెగ్యులేషన్ నిధులు రూ.3 కోట్ల వరకూ రావాల్సి ఉందన్నారు.కార్మికులకు వేతనాలు అందించడం లేదని, మరమ్మతులకు ఇబ్బందులు పడుతున్నామని, పూడిక తీత పనులు చేపట్టేటందుకు తీవ్ర అవస్థలు పడుతున్నామని తెలిపారు. లిఫ్ట్‌లో ఇంకా సుమారు 40 శాతం పనులు చేయాల్సి ఉందన్నారు. దీనిపై ఎంఎల్ఎ మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం అంబేద్కర్ గురుకుల పాఠశాలలో వనం-మనం కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రైతులు, నాయకులు పాల్గొన్నారు.



స్విచ్ ఆన్‌చేసి సాగునీటిని విడుదల చేస్తున్న ఎంఎల్ఎ మద్దిపాటి

రెస్టారెంట్లలో అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌పి కెఎస్ఎస్‌వి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం పట్టణంలోని కెఎఫ్‌సి, సత్య పంచకళ్యాణి పలావ్ హోటల్, పందలపాక బిర్యానీ హోటల్స్‌లో విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజి, రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆహారపదార్థాలు, నూనెల నమూనాలను పరీక్ష నిమిత్తం పంపించామన్నారు. కెఎఫ్‌సిలో వంటకు ఉపయోగిస్తున్న ఎడిబుల్ ఆయిల్స్‌లో టోటల్ పోలార్ కాంపౌండ్స్ ఎక్కువగా ఉండడంతో కేసు నమోదు చేస్తామన్నారు. పంచకల్యాణి హోటల్‌లో పరిశుభ్రత పాటించని కారణంగా యాజమాన్యానికి నోటీసు ఇచ్చారు. వేయింగ్ మిషన్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. గృహావసరాల సిలిండర్లు ఉపయోగించడంతో కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఎస్ఐ జగనాథరెడ్డి, డిసిటిఒ నవీన్ కుమార్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రుక్కయ్య, లీగల్ మెట్రాలజీ అధికారి బాలాజీ, పిసిఎస్ వలి, కిషోర్, శివ, లోవరాజు, వీరబాబు పాల్గొన్నారు.

గర్భిణికి 'మానవత' సాయం

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు గ్రామానికి చెందిన గర్భిణి సూరా లావణ్యకు మానవత డైరెక్టర్ ఆళ్ల వీరవెంకటసత్యనారయణ రూ.5వేల సాయం అందించారు. ఆమె వైద్య అవసరాల నిమిత్తం ఈ సాయం అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మానవత సభ్యులు కరుటూరి సతీష్ , చైర్మెన్ జుజ్జవరపు వెంకట కష్ణప్రసాద్, ట్రెజరర్ గ్రంథి నాగ వీరవెంకట సుబ్బారావు గుప్త, గ్రామ కన్వీనర్ జుట్టా కష్ణమూర్తి, ఇ.సి విద్య కోడి నాగేశ్వరరావు , ఇ.సి.హెల్త్ కోట నాగేశ్వరావు , డాక్టర్ తనూజ, . మనోజ్, వైద్య సిబ్బందికి పాల్గొన్నారు

జిల్లా వ్యాప్తంగా వనం- మనం

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వనం-మనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పలుచోట్ల మొక్కలు నాటారు. ఉండ్రాజవరంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు.

ఉండ్రాజవరం బౌద్ధ దమ్మ పీఠంలో పీఠాధిపతి భంతే అనాలయో ఆధ్వర్యంలో వనం-మనం కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి కందుల దుర్గేష్ పాల్గొని మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్క నాటి, వృక్షంగా మార్చాలన్నారు. ఈ సందర్భంగా చిప్‌కో మూమెంట్ కోసం ఆయన వివరించారు. అనంతరం మహిళలకు మొక్కల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **కడియం** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిపి వెలుగుబంటిప్రసాద్ పాల్గొని మొక్కలు నాటారు. కడియపులంక సర్పంచ్ పాటంశెట్టి రాంజీ మాట్లాడుతూ రోడ్లకిరువైపులా, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. ఎంపిడిఒ కె.రత్నకుమారి మాట్లాడుతూ నాటిన మొక్కలను విద్యార్థులు దత్తత తీసుకొని సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ కోర్ ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ, సర్పంచ్ మోసిగంటి సత్యవతి, వైస్ ఎంపిపి కలిదిండి విశాలాక్షి, ఇన్‌ఛార్జి హెచ్ఎం రామకృష్ణంరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు. **సీతానగరం** మండలం పురుషోత్తపట్నంలో నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమంలో బయోడైవర్సిటీ రీజనల్ కో-ఆర్డినేటర్ వి.సత్యప్రసాద్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సినిమా దర్శకులు కాశీ విశ్వనాథ హాజరయ్యారు. పురుషోత్తపట్నం ఎంపియుపి పాఠశాల ప్రాంగణంలో టిడిపి నాయకులు మండ రాంబాబుతో కలిసి మొక్కలు నాటారు. చెరుకూరి వీర్రాజు, నల్లూరి హరిబాబు, వేములపల్లి గంగరాజు, యనమదల వినాయక కష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు. **తాళ్లపూడి** మండలం వేగేశ్వరపురం జూనియర్ కళాశాల ఆవరణలో ఎంపిడిఒ రమణ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఎపిఒ సిహెచ్.రమాదేవి మాట్లాడుతూ శుక్రవారం జరిగిన కార్యక్రమానికి 25 కొబ్బరి మొక్కలు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు, తహాశీల్దార్ రాజేంద్రనాథ్, ప్రిన్సిపల్ జి.శ్రీనివాస్ పాల్గొన్నారు. **గోకవరం** మండలంలోని భూపతిపాలెం గురుకుల పాఠశాల ఆవరణలో జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నెహ్రూ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎంతో ప్రతిష్టాత్మంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. దీన్ని విజయవంతం చేయాలన్నారు. 150 కొబ్బరి మొక్కలు, 50 రకాల వివిధ పండ్ల మొక్కలు నాటామన్నారు. వీటిని సంరక్షించాలని ఎపిఒను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విఎస్ అప్పలరాజు, అడపా భరత్‌బాబు, గాజింగం సత్తిబాబు, జడ్‌పిటిసి సభ్యులు దాసరి రమేష్, దాసరి తమ్మన్న దొర, మంగ రౌతు రామకష్ణ, స్కూల్ చైర్మన్ గల్లా రామచంద్రరావు, వైస్ చైర్మన్ రాజీవ్, సర్పంచులు అడపా వెంకట్రావు, విడుదల అర్జున్ రావు, కమ్మెలవెంకటేశ్వరరావు, దాసరి సీతారామకష్ణ, అధికారులు పాల్గొన్నారు. **పెరవలి** మండలం కొత్తపల్లి అగ్రహారం సచివాలయం వద్ద మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. సర్పంచ్ బండారు వెంకటరమణసాయిబాబా, టిడిపి నియోజకవర్గ అధ్యక్షులు అబ్బిశెట్టి సత్తిరాజు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు బర్రె దొరస్వామి జిల్లా జనసేన జనరల్ సెక్రెటరీ ఉలుసు సత్యసౌజన్య తదితరులు పాల్గొన్నారు.



ఉండ్రాజవరంలో మొక్కలు నాటుతున్న మంత్రి దుర్గేష్

డిఎల్ఎస్ఎ సభ్యునిగా అనంతరావు నియామకం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తూర్పుగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్యునిగా గొట్టిముక్కల అనంతరావు నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి వారి సంప్రదింపులతో రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు జిఒ 805ను జారీ చేసింది. రెండు సంవత్సరాల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ఈ సందర్భంగా అనంతరావు మాట్లాడుతూ న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ప్రతి ఒక్కరూ సమస్యలకు పరిష్కారం పొందొచ్చన్నారు. డిఎల్ఎస్ఎ ద్వారా నిరు పేదలకు ఉచిత న్యాయం అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా అనంతరావును పలువురు న్యాయవాదులు, ప్రభుత్వ అధికారులు అభినందించారు.

హిడెన్ కెమెరాలు అమర్చిన దోషులను శిక్షించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల గర్ల్స్ హాస్టల్ వాష్‌రూమ్స్‌లో హిడెన్ కెమెరాలు పెట్టిన నిందితులను కఠినంగా శిక్షించాలని పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సీనియర్స్ కొంతమంది సహాయంతో గర్ల్స్ హాస్టల్ వాష్ రూమ్స్‌లో కెమెరాలను అమర్చినట్టు వార్తలు వస్తున్నాయన్నారు. ఈ విషయం యాజమాన్యానికి వారం రోజుల క్రితమే విద్యార్థినులు తెలియజేసినప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు.

అంగన్‌వాడీ భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్థానిక 47వ డివిజన్‌లోని రెండు అంగన్ వాడీలకు సొంత భవనంలోకి మార్పు చేశారు. ఆ భవనాన్ని రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండు అంగన్‌వాడీ కేంద్రాలను సిద్ధార్థ నగర్‌లోని మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాల ఆవరణలోని ఒక భవనంలోకి మార్చామన్నారు. పిల్లలు ఇబ్బందిపకుండా ఉండేందుకు కావాల్సిన సౌకర్యాలు సమకూరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌ఛార్జ్ బేసరి చిన్ని, మాజీ కార్పొరేటర్ రేలంగి శ్రీదేవి, టిడిపి నాయకులు కవులూరి వెంకటరావు, మోతా నాగలక్ష్మి, అంగన్ వాడీలు పాల్గొన్నారు.

గత నెల పింఛన్ ఇప్పించండి సారూ..!

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

అనారోగ్య కారణాల వల్ల గత నెల పింఛను అందుకోలేదని సూర్యారావు పాలేనికి చెందిన వికలాంగుడు మర్లపూడి ప్రసాద్ తెలిపారు. ఈ పింఛను ఇప్పించాలని కోరుతున్నాడు. ఆర్థిక పరమైన ఇబ్బందులు పడుతున్నానని ఈ నెల పింఛనుతో పాటూ గత నెల పింఛను కూడా అందించాలని కోరుతున్నాడు. ఇదిలా ఉండగా నేడు ఇళ్ల వద్దే పింఛన్లు పంపిణీ చేయనున్నట్టు ఎంపిడిఒ జివిఎస్.రామకృష్ణరాజు తెలిపారు. మొత్తం 10,483 మంది లబ్ధిదారులకు పింఛను అందిస్తామన్నారు.

సీతానగరం ఎస్ఐగా రామ్‌కుమార్

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం ఎస్ఐగా డి.రామ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన కృష్ణా జిల్లా విజయవాడ నుండి సీతానగరానికి వచ్చారు. పోలీస్ స్టేషన్లో బాధ్యతలు చేపట్టిన అనంతరం సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

సీతానగరంలో అడిషనల్ ఎస్‌పి తనిఖీలు

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం పోలీస్ స్టేషన్‌లో అదనపు ఎస్‌పి (లా అండ్ ఆర్డర్) ఎవి.సుబ్బరాజు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనంతరం సీతానగరం పోలీస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సమావేశంలో సుబ్బరాజు మాట్లాడుతూ పోలీసులు ప్రజల పట్ల గౌరవప్రదంగా వ్యవహరించాలన్నారు. పోలీసులు ప్రజలకు నిష్పక్షపాతంగా సేవలు అందించాలని, ప్రజలకు ఆదర్శంగా నిలవాలన్నారు. పాత నేరస్తులు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్‌గా శ్రీనివాసరావు

ప్రజాశక్తి- గోకవరం

గోకవరం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్‌గా రాయవరపు శ్రీనివాసరావుని నియమిస్తున్నట్లు జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ తెలిపారు. శ్రీనివాసరావు ఇటీవలే అనారోగ్యానికి గురై కోలుకున్నారు. ఎంఎల్ఎ జ్యోతుల ఆయనను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం మండల టిడిపి నాయకులు సమక్షంలోనే ఆసుపత్రికి డైరెక్టర్‌గా ప్రకటించారు.

ఇండస్ట్రియల్ టూర్‌తో అవగాహన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం


ఇండస్ట్రియల్ టూర్‌తో సాంకేతి అంశాలపై అవగాహన పెరుగుతుందని హెచ్ఎం కెఎస్‌కె.మాణిక్యాలరావు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఒకేషనల్, 9, 10 తరగతి విద్యార్థులకు లెర్నెట్ స్కిల్స్, ఎన్ఎస్‌డిసి ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా మోర్తలో ఉన్న 33 కెవి సబ్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడారు. విద్యుత్ కొనుగోలు, సరఫరా తదితర అంశాలపై సబ్ స్టేషన్ ఇంజనీర్లు దొరబాబు, సుమన్ విద్యార్థులకు వివరించారన్నారు. ఈ కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనింగ్ టీచర్ శ్రీనివాస్‌ను ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, పుష్ప వల్లి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

దోమలు కుట్టకుండా జగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డిఎంహెచ్ఒ సూచించారు. శుక్రవారం రాజమండ్రి రూరల్ మండలం బొమ్మూరు-1 సచివాలయ ప్రాంతంలో వైద్య ఆరోగ్యశాఖ నిర్వహించిన "ఫ్రైడే డ్రై డే" కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజలు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా కార్యాలయ సిబ్బందితోపాటు ధవళేశ్వరం పిహెచ్‌సి వైద్య సిబ్బంది పాల్గొన్నారు

కార్టూ'నిజం'



పలుచోట్ల వైద్యశిబిరాలు

ప్రజాశక్తి - యంత్రాగం

జిల్లాలో పలుగ్రామాల్లో ఫీవర్ సర్వేలు నిర్వహించి వైద్య శిబిరాలను నిర్వహించారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. **నల్లజర్ల** మండలం జగన్నాథపురంలో నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో పిహెచ్‌సి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ తెల్లం గంగాధరరావు ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. జ్వరపీడితుల నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించారు. 75 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఆరోగ్య కార్యదర్శి నాగరాజ్యం, ఆరోగ్య సహాయకులు రాఘవ, ఆశా కార్యకర్తలు స్వరూపరాణి, జ్యోతి, సుజాత పాల్గొన్నారు. **తాళ్లపూడి** మండలంలోని వేగేశ్వరపురం, తాళ్లపూడి, చిడిపి, తిరుగుడుమెట్ట, రావూరుపాడు గ్రామాల సచివాలయాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. వర్షాల నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులు సూచించారు. ఈ శిబిరాల్లో తాళ్లపూడి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ హారికాగుప్త, మలకపల్లి వైద్యాధికారులు డాక్టర్ పి.అన్నపూర్ణ, డాక్టర్ పి.సుచందన వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **కడియంలో** ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. శుక్రవారం మాధవరాయుడు పాలెంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 41 మందికి పరీక్షలు నిర్వహించారు. ఏడుగురు జ్వరపీడితులను గుర్తించి డెంగీ పరీక్షలు నిర్వమించారు. ఈ శిబిరంలో డాక్టర్ ఎన్.నాగసాయి మౌర్య, పంచాయతీ కార్యదర్శి బి.శిరీష, హెల్త్ అసిస్టెంట్ పి.మురళీకృష్ణ, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు. **ఉండ్రాజవరం** మండలంలోని వేలివెన్ను, ఉండ్రాజవరం పిహెచ్‌సి పరిధిలోని సూర్యారావుపాలెం, తాడిపర్రు గ్రామాల్లో శుక్రవారం మెడికల్ క్యాంపులు నిర్వహించారు. సూర్యారావు పాలెంలో ఫ్రెండ్లీ హెల్త్ క్లినిక్, ఇంటింటా సర్వే నిర్వమించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ఇర్ఫాన్, ఆర్.ఉషాదేవి, ఆరోగ్య పర్యవేక్షకులు జిన్నూరి శీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్ కెకె.సుభాషిణి, ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు. **ఎరవలి** మండలం కానూరు పిహెచ్‌సి ఆధ్వర్యంలో కానూరు-1 సచివాలయం ఏరియాలో శుక్రవారం ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు కె. హేమ రాజు మాట్లాడారు. ఇందిరమ్మ కాలనీ సచివాలయం భవనం వద్ద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సత్యేంద్రకుమార్, ఎంపిహెచ్ఇఒ రాజసులోచన, పిహెచ్ఎన్ కెవి.నాగేశ్వరరావు, ఎంపిహెచ్ఎస్ విజయలక్ష్మి, హెచ్‌వి ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు. లంక మాలపల్లి సచివాలయం పరిధిలో ఉన్న క్రీస్తు లూథరన్ సంఘం ఆధ్వర్యంలో తణుకు టౌన్ కు చెందిన సన్ హాస్పిటల్ వైద్యులు ఎస్.శోభాశరణ్ 200 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.



కడియంలో...



తాళ్లపూడి మండలంలో వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు

నేరాలు ఘోరాలు

అత్యాచారం కేసులో పదేళ్ల జైలు, జరిమానా

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

పెళ్లి చేసుకుంటానని నమ్మించి, ఆమెపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిపై నేరం రుజువు కావడంతో శుక్రవారం కోర్టు పదేళ్ల యావజ్జీవ కారాగార జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధించింది. ఈ కేసుకు సంబంధించి శుక్రవారం అమలాపురం రూరల్ సిఐ పి.వీరబాబు వివరాలు వెల్లడించారు. ఎన్.కొత్తపల్లి పంచాయతీ పెద రాఘవుల పేటకు చెందిన యువతి ఎంపిపి పాఠశాల్లో విద్యా వాలంటరీగా పనిచేస్తోంది. అదే గ్రామానికి చెందిన కొప్పాడి నాగరాజు అదే పాఠశాల్లో విద్యా వాలంటరీగా పనిచేస్తూ యువతిని ప్రేమిస్తున్నానంటూ ఆమె వెంటపడ్డాడు. తను లేకపోతే చనిపోతానని మాయ మాటలు చెప్పి 2012 సెప్టెంబర్ 10న పాఠశాల మూసివేసిన అనంతరం యువతిని అదే పాఠశాల పై అంతస్తుకు తీసుకువెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఏడాది తర్వాత పెళ్లి చేసుకోమంటే ముఖం చాటేశాడు. కొంతకాలానికి నాగరాజు ఇంటికి యువతి తల్లి వెళ్లి పెళ్లి విషయమై అడిగింది. మీ అమ్మాయి అంటే నాకు ఇష్టం లేదు పెళ్లి చేసుకోనని నాగరాజు చెప్పాడు. దీనిపై 2019 సెప్టెంబర్ 26న బాధితురాలు ఉప్పలగుప్తం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ ఎన్ఎస్.నాయుడు కేసు నమోదు చేశారు. అప్పటి రూరల్ సిఐ ఆర్.భీమరాజు కేసు దర్యాప్తు చేసి నిందితుడు కొప్పాడి నాగరాజును అరెస్టు చేసి కోర్టు ద్వారా రిమాండ్‌కు పంపించారు. పూర్తి సాక్ష్యాధారాలతో నాగరాజుపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. జిల్లా 8వ అడిషనల్ సెషన్స్ కోర్టు రాజమహేంద్రవరం స్పీడ్ ట్రయిల్ కేసుగా కేసును ట్రయిల్ జరగగా పిపి మారిశెట్టి వెంకటేశ్వరరావు ప్రాసిక్యూషన్ తరపున వాదనలు వినిపించారు. వాదోపవాదాలు అనంతరం నిందితుడు నాగరాజుపై నేరం రుజువు కావడంతో జడ్జి వై.బెన్నయ్య నాయుడు నిందితునికి పదేళ్ల యావజ్జీవ కారాగార శిక్ష, రూ. 5 వేలు జరిమానా విధించారనని సిఐ వీరబాబు తెలిపారు.

84 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - కిర్లంపూడి

మండలంలోని కృష్ణవరం టోల్ ప్లాజా వద్ద చేపట్టిన తనిఖీల్లో ఆయిల్ ట్యాంకర్‌లో తరలిస్తున్న 84 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముందస్తుగా వచ్చిన సమాచారంతో గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో కిర్లంపూడి పోలీసులు కృష్ణవరం టోల్ ప్లాజా వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. వైజాగ్ నుంచి రాజమహేంద్రవరం వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్‌ను తనిఖీ చేయగా వాహనం యొక్క టాప్ క్యాబిన్, క్లీనర్ సీటు కింద భాగంలో 43 ప్యాకెట్లలో ఉన్న గంజాయిని మధ్యవర్తుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. గంజాయితోపాటు, లారీని, డ్రైవర్ నుంచి రూ.1000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్‌పి లతాకుమారి తెలిపారు. సిఐ లక్ష్మణరావు, కిర్లంపూడి ఎస్ఐ జి. సతీష్‌కుమార్, సిబ్బందిని ఎస్‌పి అభినందించారని ఆమె తెలిపారు.

సారా బట్టీపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని కె.గోపాలపురం గ్రామ శివారున నిర్వహిస్తున్న నాటు సారా బట్టీపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఒక వ్యక్తిని అరెస్టు చేసి, 20 లీటర్ల సారాను సీజ్ చేసినట్లు ఎస్ఐ యువి.శివ నాగబాబు తెలిపారు. అలాగే సారా తయారీకి వినియోగించేందుకు సిద్ధం చేసిన 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసి ముద్దాయిని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

40 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - గోకవరం

సారా బట్టీలపై దాడి 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. రంపఎర్రంపాలెంలో సారా బట్టీలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు ఎస్ఐ పవన్ కుమార్ సిబ్బందితో దాడులు చేశారు. ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి 40లీటర్ల సారా, నాలుగు అల్యూమినియం పాత్రలను స్వాధీనం చేసుకున్నారు. 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

యువ న్యాయవాది ఆత్మహత్య

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పుల బాధ భరించేలేక యువ లాయర్ ఆత్మహత్యకి పాల్పడిన సంఘటన గురువారం జరిగింది. అప్పనపల్లికి చెందిన మేడేపల్లి సురేష్(30) చేసిన అప్పును తీర్చలేదని ఫైనాన్స్ కంపెనీకి చెందిన వారు పలుమార్లు ఇంటికి వచ్చి అడిగారు. గ్రామంలో పరువు పోయిందని మనస్థాపం చెందిన సురేష్ గడ్డి మందు తాగాడు. అతను అమలాపురం శ్రీనిధి హాస్పిటల్స్‌లో జాయిన్ చేశారు. అయితే అతని ఆరోగ్య పరిస్థితి విషమించడంతో గురువారం రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుని తండ్రి మేడేపల్లి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఊస్ఐ చైతన్యకుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని చిట్యాల శివారు జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. చెరుకుమిల్లికి చెందిన దాకే నాగేంద్ర, అదే గ్రామానికి చెందిన కొర్లపాటి రామకృష్ణ కలిసి గురువారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో బైకుపై గోపాలపురం వెళుతున్నారు. చెరుకుమిల్లి నుంచి చిట్యాల గ్రామం వెళ్లు రోడ్డులో రైస్ మిల్లు వద్దకు వచ్చేసరికి బైకు అదుపుతప్పడంతో వారు పడిపోయారు. బైకు నడుపుతున్న దాకే నాగేంద్ర(30) అక్కడికక్కడే మృతి చెందాడు. రామకృష్ణ గాయపడ్డాడు. ప్రస్తుతం రాజమహేంద్రవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుని భార్య భార్గవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు పెద్దాపురంలో వనం-మనం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఈనెల 31వ తేదీ ఉదయం పెద్దాపురం - జగ్గంపేట రహదారిలో పాండవుల మెట్ట వద్ద వనం - మనం కార్యక్రమం ప్రారంభమవుతుందని మున్సిపల్ కమిషనర్ పద్మావతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మంగతాయారు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు.

కిడ్నీ బాధితులకు వరప్రసాదం డయాలసిస్ కేంద్రం

- 2న రాజోల్లో ప్రారంభం
- ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ వెల్లడి



డయాలసిస్ సెంటర్(ఇన్‌సెట్)లో ఏర్పాటు చేసిన డయాలసిస్ యంత్రం

ప్రజాశక్తి-రాజోలు

నియోజకవర్గంలో ఆక్వా సాగు, పంటపొలాల్లో మితి మీరిన రసాయన మందుల వాడకం వల్ల రాను రాను భూగర్భ జలాలు కలుషితమై.. ప్రజలు ఎక్కువగా మూత్ర పిండాల వ్యాధి బారిన పడుతున్నారు. దీంతో అక్కడ ప్రజలకు డయాలసిస్ కేంద్రం అవసరం చాలా ఉంది. దగ్గరలో అందుబాటులో లేకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లేందుకు రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఇబ్బందులు గమనించిన రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ రాజోలు ప్రాంతీయ ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాట్లు చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వచ్చే నెల 2న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టినరోజు రోజుడయాలసిస్ కేంద్రంలో సేవలు అందుబాటులోకి తీసుకురానున్నారు.

ఎన్నో ఇబ్బందులు

డయాలసిస్ సెంటర్లు అందుబాటులో లేక ఇప్పటికే బాధితులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికంగా డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేసి ఖరీదైన వైద్యాన్ని పేదలకు ఉచితంగా అందించేందుకు సిద్ధమైయ్యారు రాజోలు ఎంఎల్ఎ. నియోజకవర్గ ప్రజలకు అమలాపురం, భీమవరం, కాకినాడ, రాజమండ్రి తదితర నగరాలకు వెళ్లి చికిత్స చేసుకునే బాధ నుంచి ఊరట కలిగిస్తున్నది. తాజాగా రాజోలు ఏరియా ఆసుపత్రి సిద్ధమైంది. ఐదు యంత్రాలతో బెడ్లు ఏర్పాటు చేయగా దీనిని సెప్టెంబర్ 2న ప్రారంభించనున్నారు. వీటిల్లో ఒక్కో యంత్రం ద్వారా రోజుకు 5 నుంచి 6 మంది మంది డయాలసిస్ చేయించుకోవచ్చు. ఒక్కో బాధితుడికి ప్రభుత్వం నెలకు రూ.లక్ష వరకు ఖర్చు చేస్తున్నది. దగ్గరలో డయాలసిస్ సెంటర్లు లేకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లడం, ప్రయివేటు దవాఖానల్లో రూ.వేలు ఖర్చు అవుతుండడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తుల ఇబ్బందులను గమనించిన రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఇప్పుడు స్థానికంగా డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయడంతో సమయం, డబ్బు ఆదా అవుతుందని రోగులు చెబుతున్నారు. ప్రతి రోగికి నెలకు సుమారు రూ.ఆరు వేల విలువైన రక్తం, ఐరన్ ఇంజక్షన్‌తోపాటు కిట్‌ను వాడుతుండడంతో ఒక్కో రోగికి ప్రభుత్వం నెలకు సుమారు రూ.లక్ష వరకు ఖర్చు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

విచ్చల విడిగా మందులు వినియోగించొద్దు

వైద్యుల సలహాలు లేకుండా నొప్పులు, ఇతర జబ్బులకు విచ్చల విడిగా మందులు వాడొద్దు, దీర్ఘకాలిక వ్యాధులైన మధుమేహం, బిపిని నిర్లక్ష్యం చేస్తే కిడ్నీకి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. నెల నెలా పరీక్షలు చేయించుకుంటూ డాక్టర్లు రాసిన మందులు వాడుతూ వాటిని అదుపులో ఉంచుకోవాలి. తొలి దశలోనే లక్షణాలను గుర్తించి వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలి. ఆహారపు అలవాట్లలో మార్పులు, నిత్యం ఒత్తిడికి గురికావడంతోపాటు, వ్యాధుల పట్ల నిర్లక్ష్యం వహించడం వల్ల, కలుషిత నీటి వల్ల కిడ్నీ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోంది. జిల్లాలో సుమారు 2500 మంది కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు.

- రాపాక రమేష్ బాబు, డాక్టర్, మలికిపురం

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఎంతో ఉపయోగకరం



రాజోలు కమ్యునిటి హెల్త్ సెంటర్ దవాఖానాలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుతో నియోజకవర్గంలోని కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మేలు జరుగుతుంది. కిడ్నీ వ్యాధిగ్రస్తులు దూర ప్రాంతాలకు వెళ్లలేక, ఆర్థికంగా ఇబ్బందులు ఉండడంతో ఎంతో మంది మృతిచెందారు. కొన్ని సందర్భాల్లో డయాలసిస్ పేషెంట్లు చెప్పిన మాటలు వింటుంటే కంట నీరు వచ్చేది. రాజోలులో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేస్తే పేదలకు అందుబాటులో ఉంటుందన్న ఆలోచనతో పనులు యుద్ధప్రాతిపాధికన పూర్తి చేశాం. సెప్టెంబర్ 2న ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ పుట్టినరోజు ఈ సేవలు అందుబాటులోకి తీసుకొని రావడం ఆనందంగా ఉంది.

-దేవ వరప్రసాద్,రాజోలు ఎంఎల్ఎ

అభివృద్ధి పనులపై ఎంఎల్ఎ సమీక్ష



అధికారులతో చర్చిస్తున్న ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్

ప్రజాశక్తి - యానాం

పిడబ్ల్యూడి, మున్సిపాలిటీ ద్వారా చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ సమీక్షించారు. శుక్రవారం స్థానికంగా సంబంధిత శాఖ అధికారులతో ఆయన బేటీ అయ్యారు. ఎంఎల్ఎ నిధులతో గతంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశామని, కానీ ఇప్పటి వరకూ ఎందుకు పనులు చేపట్టలేదని ప్రశ్నించారు. తక్షణమే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పిడబ్ల్యూడి ఎఇ కాళ్ల నాగరాజు, జెఇ జ్యోతిరాజు, మున్సిపల్ ఎఇ కుమార్ పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై సమీక్ష

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లాలో పారిశుధ్య నిర్వహణ పై శుక్రవారం అమలాపురం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ పంచాయతీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జాతీయ, రాష్ట్ర, జిల్లా ప్రధాన రహదారులు, డ్రెయిన్లు, కాలువలు, ఏటిగట్ల వెంబడి పంచాయతీలు వేస్తున్న చెత్తకుప్పలను తక్షణమే తొలగించి జిల్లాలో సమీపంలోని ఎస్‌డబ్ల్యుపిసి (సాలిడ్ వెస్ట్ ప్రాసెసింగ్ సెంటర్) షెడ్లులకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, డివిజనల్ పంచాయతీ అధికారులు, ఇఒపిఆర్‌డిలు పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో విద్యార్థులకు బీమా సౌకర్యాన్ని కల్పించేందుకు ప్రణాళిక

గురుకుల పాఠశాలలు సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు ప్రమాదాలు, అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు గోల్డెన్ అవర్ లో వైద్య సేవలు అందించే విధంగా గోల్డెన్ అవర్ బీమా సౌకర్యాన్ని కల్పించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. గోల్డెన్ అవర్ బీమాను అతి తక్కువ ప్రీమియంతో జిల్లాలోని గురుకుల పాఠశాలలు సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు అందించేందుకు కార్యాచరణ రూపొందించే అంశంపై శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ బ్యాంకర్లతో సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రులకు దూరంగా గురుకుల పాఠశాలలు సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రమాదాల సమయంలో అన్ని ప్రైవేటు ఆసుపత్రులలో వైద్య సేవలు ఉచితంగా అందించడానికి బీమా సౌకర్యాన్ని కల్పించే దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. జిల్లాలో 7752 మంది విద్యార్థులు గురుకుల పాఠశాలలు సంక్షేమ వసతి గృహాల్లో ఉండి చదువుకుంటున్నారన్నారు.



అంబాజీపేట లో అసంపూర్తిగా ఉన్న తహశీల్దార్ కార్యాలయ భవనం

తహశీల్దార్ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి

ప్రజాశక్తి-అంబాజీపేట

అంబాజీపేటలో 2018 లో అప్పటి టిడిపి ప్రభుత్వం హయాంలో నిర్మాణం చేపట్టిన తహశీల్దార్ కార్యాలయ భవనం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని పి.గన్నవరం నియోజకవర్గం టిడిపి కోకన్వీనర్ దాసరి వీర వెంకట సత్యనారాయణ సిఎం చంద్రబాబు కు శుక్రవారం విన్నవిస్తూ వినతిపత్రం అందజేశారు.2019 లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తహశీల్దార్ భవన నిర్మాణ పనులు ఎలా ఉన్నది అలానే నిలిపివేశారని పేర్కొన్నారు. మాచవరం గ్రామ పరిధిలో ఎంపిడిఓ కార్యాలయం పక్కన 2018 అన్నా క్యాంటిన్ భవన నిర్మాణానికి అప్పటి టిడిపి ప్రభుత్వం అనుమతులు మంజూరు పునాదులు వరకు నిర్మాణం చేపట్టారన్నారు. ప్రభుత్వం మారడంతో ఆ నిర్మాణం కూడా నిలచిపోయిందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆభవన నిర్మాణ పనులు పూర్తిచేసి రెండవ విడత అన్నా క్యాంటిన్ ప్రారంభించాలని కోరారు.

భారీ వర్షంతో అవస్థలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో శుక్రవారం ఉదయం నుండి రాత్రి వరకు వర్షం ఎడతెరిపి లేకుండా కురిసింది. దీంతో ఇళ్ల నుంచి బయటకు వచ్చే ప్రజలు ఇక్కట్ల గురయ్యారు. వర్షం ఎప్పటికీ తగ్గకపోవడంతో జనజీవనం స్తంభించింది. వ్యాపార, వాణిజ్య సంస్థలన్నీ వర్షం కారణంతో మూతపడ్డాయి. వర్షంతో ఉద్యోగులు విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. మరో రెండు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. అల్పపీడనం బలపడి తుఫానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

మధ్యాహ్న భోజనం బాగాలేదని స్కూల్ నుంచి వెళ్లిపోయిన విద్యార్థులు

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని బట్లపలిక ప్రాథమిక పాఠశాల్లో బుధవారం మధ్యాహ్న భోజనం బాగాలేదని నిరసన తెలిపిన విద్యార్థులు శుక్రవారం పాఠశాల నుంచి వెళ్లిపోయారు. మధ్యాహ్నం భోజనం బాగాలేదని చెప్పిన సమస్య పరిష్కారం కాలేదని వారంతా భోజన సమయంలో స్కూల్ నుంచి బయటికి వచ్చేశారు. దీంతో గ్రామస్తులు పలువురు సమస్య పరిష్కరించలేదని మండల విద్యాశాఖ అధికారి కి ఫోన్ ద్వారా తెలియజేశామన్నారు. అయితే భోజన పథకంలో పనిచేసే సిబ్బందిని మార్చే అవకాశం తనకు లేదని ఉన్నతాధికారుల దష్టికి తీసుకువెళ్తానని ఎంఇఒ తెలిపారు. ఎప్పటికైనా సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

'లయన్స్' కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-రామచంద్రాపురం

పట్టణంలోని లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం శుక్రవారం జరిగింది. జిల్లా పూర్వపు గవర్నర్ లయన్ బాదం బాలకృష్ణ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. గవర్నర్ లయన్ వేలూరి సూర్యనారాయణ మాట్లాడుతూ, లయన్స్ ఇంటర్నేషల్ సంస్థ యొక్క ఉద్దేశాలు, సంస్థ చేసే సర్వీస్ యాక్టివిటీస్ సభకు తెలియజేశారు ప్రస్తుత గవర్నర్ లయన్ ఇవివి. ఈశ్వర కుమార్ మాట్లాడుతూ క్లబ్ సభ్యత్వం పెంచుతూ లయన్స్ సేవలు విస్తృతం చేయవలసినదిగా క్లబ్ సభ్యులకు తెలియజేశారు. నూతన క్లబ్ ప్రెసిడెంట్‌గా ప్రమాణం చేసిన వికాస్ కాలేజీల అధినేత లయన్ వాసంశెట్టి వెంకటరమణ మాట్లాడుతూ క్లబ్ సభ్యులు అందరి సహకారంతో, పట్టణ ప్రజలకు సేవలు అందిస్తామన్నారు. క్లబ్ సెక్రటరీ గా లయన్ వి.చంద్రం బాబు, ట్రెజరర్ గా లయన్ మల్లిపూడి నవీన్ కుమార్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి-రాజోలు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ అన్నారు. శుక్రవారం శివకోటి కాపు తెలగ కల్యాణ మండపంలో రాజోలు, మామిడికుదురు మండలాల కూటమి సమావేశం నిర్వహించారు. ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ మాట్లాడుతూ సెప్టెంబర్ 2న పవన్ కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా మురుగు కాల్వలు, వీధులు శుభ్రంగా ఉండేలా చూడాలని కుటమి నాయుకులకు, కార్యకర్తలకు ఆదేశించారు. పచ్చదనం పరిశుభ్ర ద్వారా గ్రామల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలన్నారు.

ఇసుక దొంగలపై కేసు నమోదు

ప్రజాశక్తి-రామచంద్రపురం

ద్రాక్షారమ పరిధిలోని వెల్లసావరం వద్ద గహ నిర్మాణ శాఖ కు చెందిన ఇసుకను కొందరు దొంగలించారంటూ వివిధ పత్రికల్లోనూ మాధ్యమాల్లోనూ వచ్చిన వార్తలపై రామచంద్రపురం ఆర్‌డిఒ సుధాసాగర్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 27న హౌసింగ్ శాఖకు సంబంధించిన 2 వేల టన్నులు ఇసుక అపహరణకు గురైనట్లు అధికారులు గుర్తించారు. దీనికి సంబంధించిన నిందితులు దొంగల శ్రీధర్, కట్ట అశోక్ అలియాస్ పండు, వాసంశెట్టి చంద్రశేఖర్ అలియాస్ బాల, ఆదిమూలం సాయి మణికంఠ, కాంద్రేగుల సాయిరాం అనే వ్యక్తులు అపహరించకపోయారని విచారణలో తేలిందన్నారు. వీరందరి పైన గహ నిర్మాణ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశామని వీరిపై ప్రజా ఆస్తుల పరిరక్షణ చట్టం 1984 క్రింద సెక్షన్ 303 (2) కింద కేసులు నమోదు చేసి విచారణ జరుగుతున్నట్లు ఆర్‌డిఒ తెలిపారు.

అభ్యసనా నైపుణ్యాలపై శిక్షణ

ప్రజాశక్తి-ముమ్మిడివరం

నగర పంచాయతీ పరిధిలోని స్థానిక ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియం హాలు నందు శుక్రవారం అందించి వికలాంగుల్లో అభ్యసనా నైపుణ్యాలు ఏ విధంగా పెంపొందించాలి అనే అంశంపై శుక్రవారం సమగ్ర శిక్ష జిల్లా (ప్రాజెక్టు అధికారి) అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.మధుసూదన రావు అధ్యక్షతన ట్యాబ్ ల వినియోగంపై సహిత విద్య రిసోర్స్ పర్సన్లు ఐఈఆర్‌పి లకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణాకార్యక్రమంలో డా. నరసింహం మాట్లాడుతూ వికలాంగుల అభివృద్ధికి సమగ్ర శిక్ష అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తుందన్నారు. రాష్ట్ర సహిత విద్య సహాయ సమన్వయకర్త డా ఎన్ అమ్మి నాయుడు మాట్లాడుతూ పాల్గొని డిజిటల్ విద్యను అందించడంలో ప్రభుత్వము ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. సహిత విద్యా సమన్వయ కర్త ఎమ్‌వివి.సత్యనారాయణ మాట్లాడారు. సాధారణ విద్యార్థులతో సమానంగా వికలాంగ విద్యార్థులను తీర్చిదిద్దడంలో డిజిటల్ విద్య దోహదం చేస్తుందని రాష్ట్ర సమగ్ర శిక్ష పరిశీలకుడు, ఐఈ కన్సల్టెంట్ డాక్టర్ వై.నరసింహం అన్నారు.

హరికథా కళాకారుడు కృష్ణమూర్తి మృతి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఉప్పలగుప్తానికి చెందిన హరికథా కళాకారుడు చిక్కం కృష్ణమూర్తి(71) శుక్రవారం ఆకస్మిక మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. 1969 నుంచి 1978 వరకు కృష్ణమూర్తి బుర్రకథల కళాకారుడిగా, 1979 నుంచి హరికథా విద్వాంసుడుగా అనేక రాష్ట్రాల్లో ప్రదర్శనలు నిర్వహించారు.టిటిడి ఆధ్వర్యంలో దేశంలోని అనేక దేవాలయాల్లో హరికథలు నిర్వహించారు. అలాగే దూరదర్శన్ టివి ఛానల్ లోనూ ఆల్ ఇండియా రేడియోలలో నిర్వహించిన హరికథా కార్యక్రమాల ద్వారా అనేక మందికి కృష్ణమూర్తి సుపరిచితులు. కష్ణమూర్తి మృతికి ఎంపిపి దంగేటి వీర అచ్యుత జానకి, రాంబాబు, జెడ్‌పిటిసి సభ్యుడు గెద్దం సంపదరావు తదితరులు సంతాపం తెలిపారు.

ఆదిత్యలో 'వేద-2కె24' పోస్టర్ విడుదల



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆదిత్య సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆదిత్య 'వేద-2కె24' పేరిట నిర్వహించే జాతీయ స్థాయి టెక్ ఫెస్ట్‌ను పోస్టర్‌ను విడుదల చేశారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆదిత్య యూని వర్సిటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి మాట్లాడు తూ వచ్చే నెల 13, 14 తేదీల్లో వేద 2 కె 24 కార్య క్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. వచ్చే నెల 15వ తేదీన భారతరత్న మోక్షగుండం విశ్వేశరయ్య జయంతి సందర్భంగా రెండు రోజుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డిప్యూటీ ప్రో. ఛాన్సలర్. డాక్టర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఇంజనీర్స్ డే పురష్కరించుకుని ప్రతి ఏడాది ఆదిత్యలో జాతీయ స్థాయి టెక్ ఫెస్ట్ 'వేద-2కె24' ద్వారా భావి ఇంజనీర్స్ యొక్క సృజనను వెలికి తీసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇంజనీర్స్ డే సందర్భంగా వేద-2కె 24 నిర్వహిం చడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంఎస్.రెడ్డి తెలిపారు. వివిధ విభాగాలలో పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ప్ర జెంటేషన్, ప్రాజెక్ట్ ప్రజెంటేషన్ వంటి కాంపిటీషన్‌లతో పాటు క్విజ్ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ ఇంజనీరింగ్ కళాశాల లతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన ఇంజనీరింగ్ కళాశాలలకు సైతం ఈ 'వేదా-2కె24'లో పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎంబి.శ్రీనివాస్, ప్రో.వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి. సురేష్, డీన్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డాక్టర్ డోలా సంజయ్ ఎస్, ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, డీన్ వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

తూరంగి ప్రజల పోస్టు కార్డు ఉద్యమం



ఇంటింటికీ వెళ్లి ప్రజలతో పోస్టు కార్డులు రాయిస్తున్న నేతలు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

అర్బన్ గ్రామాలను కాకినాడ నగర పాలక సంస్థలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ తూరంగి ప్రజలు పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. శుక్రవారం తూరంగిలో చింతపల్లి అజయ్‌కుమార్ అధ్యక్షతన పౌర సంఘం ఆధ్వర్యంలో ప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి ప్రజల సంతకాలతో కార్డులను పోస్టు చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పౌర సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జోగా అప్పారావు, స్వామినాయకర్, పోలవరపు మంగ, సిహెచ్.విజయ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలో శనివారం పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపిడిఒ డి.శ్రీలలిత చెప్పారు. మండల వ్యాప్తంగా 179 మంది సిబ్బందితో ఉదయం ఆరు గంటలకు పింఛన్లను అందచేస్తామన్నారు. 11,757 పింఛన్‌దారులకు రూ.4,89,97,500 పంపిణి చేయనున్నట్లు చెప్పారు. 31 వ తేదీన తీసుకోని వారికి సెప్టెంబర్ 2వ తేదీన అందచేస్తామన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



వాసిరెడ్డి ఏసుదాసు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగుతుందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు అన్నారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద, బలహీన, బడుగు వర్గాల కోసం స్వర్గీయ ఎన్‌టి.రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ నిర్మాణాత్మకైనా ఆలోచనలతో అడుగులు వేసిందన్నారు. రాష్ట్ర ప్రజల అభివృద్ధి కోసం నాటి నుంచి నేటి వరకూ టిడిపి ప్రభుత్వం పాలన సాగిస్తూనే ఉందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా పాలకపక్షం చేస్తున్న తప్పులను ఎత్తిచూపుతూ ప్రజల పక్షాన పోరాడిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తూనే, మరోపక్క ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు అడుగులు వేస్తుందన్నారు. వైసిపి ఐదేళ్ల పాలనతో రాష్ట్రం మరో 20 ఏళ్లు వెనక్కు పోయిందని, తిరిగి పట్టాలపై ఎక్కించేందుకు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింతగా వేగం పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

2న ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - కరప

స్థానిక ఎస్తేర్ పబ్లిక్ స్కూల్ ఎదురుగా విజన్ కంటి ఆసుపత్రి వద్ద సెప్టెంబర్ 2వ తేదీనఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కుమార్ రాజా చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఎన్‌హెచ్‌ఆర్‌పిఎఫ్ సౌజన్యంతో మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎంఎల్ఎ పంతం నానాజీ ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 1 గంట వరకూ పరీక్షలు నిర్వహిస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆపరేషన్ అవసరమైన వారికి జగ్గంపేటలోని ఎల్‌వి ప్రసాద్ అనుబంధ సంస్థ లైన్ ఐ హాస్పిటల్‌లో చేస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు స్థానిక విజన్ ప్రాథమిక ఆసుపత్రి నిర్వాహకులను సంప్రదించాలని కోరారు.